
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 19 జూలై 2024



ఆదిలోనే హంసపాదులా తయారైంది రైతుల పరిస్థితి. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే అన్నదాతలకు కష్టాలు వచ్చి పడ్డాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసిన పొలాలు నీటమునిగే దశలో ఉన్నాయి. మరోపక్క జిల్లాలోని ప్రధాన డ్రెయిన్‌లలో పూడికతీత పనులు చేయకపోవడంతో ఎక్కడినీరు అక్కడే నిలబడి బయటకుపోని స్థితి నెలకొంది. వరిపొలాల్లో చేరిన వర్షపునీరు బయటకుపోని స్థితి నెలకొనడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి తోడు, ద్రోణికారణంగా మరో రెండురోజుల పాటు కోస్తాతీరం వెంబడి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ గురువారం హెచ్చరించింది. దీంతో రైతులు మరింతగా భయపడుతున్నారు.

- ఇప్పటికే సాగైన వరి పొలాలు నీట మునక
- సాగుకు సిద్ధం చేసిన పొలాల్లో తొలగని నీరు
- కోడూరు, నాగాయలంక, బందరు మండలాల్లో డ్రెయిన్ పూడికతీత లేకపోవడంతో సమస్య తీవ్రం
- మరో రెండ్రోజులపాటు కోస్తాతీరంలో వర్షాలు


కోడూరు మండలం హంసలదీవి వద్ద నీట మునిగిన పొలాలు

సాగు తంటా!

వర్షాలకు పొలాల్లోనే నీరు

డ్రెయిన్లలో తూడు, నాచు, గుర్రపుడెక్క తొలగించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌లలో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క, నాచు, తూడు, కిక్కిస, జమ్ములను తొలగించే పనులను ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. రూ.34 కోట్లతో కాలువల నిర్వహణ పనులకు టెండర్లు పిలిచామని అధికారులు చెబుతున్నా పనులు మాత్రం జరగలేదు. దివిసీమ ప్రాంతంలోని కోడూరు, నాగాయలంక మండలాల పరిధిలోని రత్నకోడు, పెదముదుగు కాలువ, లింగన్నకోడు, ఉప్పుకాలువ డ్రెయిన్‌లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తదితరాలను తొలగించే పనులు నేటికీ ప్రారంభించలేదు. మచిలీపట్నానికి చెందిన కాంట్రాక్టరుకు పనులు అప్పగించారని అధికారులు చెబుతున్నా, పనులు మాత్రం ప్రారంభించలేదు.

● వెదజల్లిన వరి పొలాలు మునక

ఖరీఫ్ సీజన్‌లో వరిసాగులో ఖర్చు, పంటకోత కాలాన్ని కొంతమేర తగ్గించుకునేందుకు రైతులు వెదజల్లే పద్ధతిలో వరినాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 34 వేల హెక్టార్లలో వరిసాగు జరిగింది. అందులో 30 వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతిలో రైతులు వరినాట్లు వేశారు. ఈ పద్ధతిలో నెలరోజుల క్రితం నాట్లు వేసిన పంటపొలాల్లో పైరు బాగుండంతోపాటు గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో కొంతమంది రైతులు మొదటికోటాగా యూరియాను కూడా చల్లారు. వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారిందని రైతులు అనుకునే సమయానికి నాలుగు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండటంతో తక్కువ ఎత్తులో ఉన్న వరిపైరు నీటమునిగే స్థితికి చేరుకుంది. గూడూరు మండలం తుమ్మలపాలెం వద్ద చింతగుంట డ్రెయిన్ పొంగి పొర్లుతోంది. మొవ్వ మండలం వీరాయిలంక, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మురుగునీరు లజ్జబండ డ్రెయిన్ ద్వారా సముద్రంలో కలుస్తోంది. తుమ్మలపాలెం సైఫన్ వద్ద తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు పొలాల్లోకి చేరుతోంది. దీంతో తుమ్మలపాలెం, తరకటూరుపాలెం తదితర ప్రాంతాల్లోని వరిపొలాలు నీట మునిగే ప్రమాదం ఉంది. ఘంటసాల, చల్లపల్లి, మొవ్వ, మచిలీపట్నం, పెడన, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో వెదజల్లిన పొలాల్లోని పైరు నీటమునిగే దశకు చేరుకుంది. వర్షం ఇలానే కొనసాగితే నారుమడులు పోయడం మరింత ఆలస్యమవుతుందని రైతులు అంటున్నారు. భారీవర్షాలు కురిసి పొలంలో నీరు వారంరోజులకుపైగా నిలబడి ఉంటే వెదజల్లే పద్ధతిలో వరినాట్లు పూర్తిచేసిన పొలాల్లోని వరిపైరు చనిపోయే ప్రమాదం ఉందని, నీటిలోనే వరిపైరు కుళ్లిపోతే, పొలాలను దమ్ముచేసి మళ్లీ నాట్లు వేయాలని, తక్కువ రోజుల వ్యవధిలో కోతకు వచ్చే వరి వంగడాలను సాగు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క, నాచులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లో నిలిచిన నీరు

- పాలకాయతిప్ప వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో సముద్రపుపోటు వచ్చే సమయంలో ఉప్పునీరు డ్రెయిన్‌లోకి వస్తోంది. దీంతో పంటపొలాల్లోని వర్షపునీరు దిగువకు పోవడంలేదు.
- కోడూరు మండలం హంసలదీవి, దింటిమెరక, పాలకాయతిప్ప, తదితర గ్రామాల్లోని పొలాల్లో వర్షపునీరు నిలబడిపోయింది. దీంతో నారుమడులు పోసేందుకు అవకాశం లేక నీరు తగ్గే వరకు వేచి ఉండి, ఆ తరువాత నారుమడులు పోయాలనే ఉద్దేశంతో ఈ గ్రామాల రైతులు ఉన్నారు.
- నాగాయలంక నుంచి సంగమేశ్వరం వరకు ప్రవహించే ఉప్పుకాలువలో పూడికతీత పనులు చేయకపోవడంతో ఈ డ్రెయిన్ వెంబడి ఉన్న అన్ని గ్రామాల్లోని పొలాల్లో వర్షపునీరు నిలబడిపోయింది. దీంతో మండలంలోని నారుమడులు పోసేందుకు అవకాశం లేని స్థితి నెలకొంది.
- వక్కపట్లవారిపాలెం గ్రామంలో రైతులు నారుమడులను దమ్ముచేసి సిద్ధం చేస్తున్నారు.


కూరగాయలతో దండలు సిద్ధం చేస్తూ..



శాకంబరీ శోభ

- ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి శాకంబరీ ఉత్సవాలు
- మూడు రోజుల పాటు పచ్చని పండుగ
- కూరగాయలు, ఆకుకూరలతో అలంకరణ

వన్‌టౌన్, జూలై 18 : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజులు జరిగే శాకంబరీ ఉత్సవాలకు సర్వంసిద్ధమైంది. అమ్మవారి ఆలయంతో పాటు ఉపాలయాలను కూరగాయలతో అందంగా అలంకరించారు. కూరగాయల రాశికి గురువారం ఈవో రామారావు, అర్చకులు పూజలు చేశారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని అమ్మవారిని వేడుకున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే ఈ ఉత్సవాల్లో హోమాలు, ప్రత్యేక అర్చనలు జరుగుతాయి. కూరగాయలతో వండిన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. ఉత్సవాల నిమిత్తం పెద ఓగిరాల నుంచి మూడు మెట్రిక్ టన్నులు, గుంటూరు జిల్లా నారా కోడూరు, చేబ్రోలు, తెనాలి నుంచి ఒకటిన్నర మెట్రిక్ టన్నుల కూరగాయలు వితరణగా వచ్చాయి. యడ్లపల్లి, సంగం జాగర్లమూడి నుంచి మూడు మెట్రిక్ టన్నుల నిమ్మకాయలు, గుంటూరు, నూజివీడు, హనుమాన్ జంక్షన్ నుంచి ఆరు మెట్రిక్ టన్నులు, సిద్ధాంతం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు నుంచి ఆరు టన్నులు, విజయవాడ నుంచి 500 కిలోల చొప్పున కూరగాయలు దాతల నుంచి అందాయి.

ఎండీవో కోసం గాలింపు

- కొనసాగుతున్న ఎన్డీఆర్ఎఫ్ సెర్చ్ ఆపరేషన్
- డీఐజీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలతో ఎస్పీ ఆధ్వర్యంలో ముమ్మర దర్యాప్తు

6లో..

రైలు బండి.. కొత్త స్టాపులండి..!

- విజయవాడ డివిజన్ మీదుగా 40 రైళ్లకు కొత్త హాల్ట్
- ప్రయాణికుల నుంచి ఆదరణ కోసం ప్రయోగం
- రేపటి నుంచి 26 వరకూ దశలవారీగా అమలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : డిమాండ్ కలిగిన స్టేషన్లలో రైళ్లకు హాల్ట్ కల్పిస్తూ దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లు కొత్తగా మరో 30 స్టేషన్లలో ఆగనున్నాయి. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో అనేక స్టేషన్లలో రైళ్లు ఆగనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం 69 రైళ్లకు సరికొత్తగా హాల్ట్ ఇవ్వగా, ఇందులో విజయవాడ మీదుగా రాకపోకలు సాగించేవి 40కి పైగా ఉన్నాయి. అయితే, దీనిని ప్రయోగాత్మకంగానే అమలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి కొంతకాలం తర్వాత పునరాలోచన చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

హాల్టింగ్ ఇలా..

ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు దశలవారీగా ఆయా రైళ్లలో నూతన హాల్ట్‌ను ప్రారంభించనున్నారు. విజయవాడ డివిజన్ పరిధిలోనూ, విజయవాడ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే దాదాపు 40 రైళ్లకు ఒక్కో హాల్ట్ చొప్పున పెంచారు. దీనివల్ల ప్రయాణికులకు మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి వస్తాయి. సికింద్రాబాద్-రాయ్‌పూర్ (రైలు నెంబరు 12771), హెచ్.నిజాముద్దీన్-తిరుపతి (రైలు నెంబరు 12708)కు బెల్లంపల్లిలో హాల్టింగ్ ఇచ్చారు. ఎర్నాకుళం-పాట్నా (రైలు నెంబరు 22699)కు ఖమ్మం స్టేషన్‌లో స్టాపింగ్ ఇచ్చారు. తిరుపతి-సికింద్రాబాద్ (రైలు నెంబరు 12763), విశాఖపట్నం-మహబూబ్‌నగర్ (రైలు నెంబరు 12861)కు మధిర స్టేషన్‌లో స్టాపింగ్ ఇచ్చారు. హెచ్.నిజాముద్దీన్ (రైలు నెంబరు 12708), ఎర్నాకుళం-పాట్నా (రైలు నెంబరు 22699)కు మంచిర్యాల స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. బెంగళూరు-దానాపూర్ (రైలు నెంబరు 12295), ఎర్నాకుళం-పాట్నా (రైలు నెంబరు 22699)కు రామగుండంలో స్టాపింగ్ ఇచ్చారు. పూరి-తిరుపతి (రైలు నెంబరు 17479), తిరుపతి-కాకినాడ టౌన్ (రైలు నెంబరు 17249), బిలాస్‌పూర్-తిరుపతి (రైలు నెంబరు 17481)కు చినగంజాం స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. గుంటూరు-రాయగడ (రైలు నెంబరు 17243)కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. గుంటూరు-నరసాపూర్ (రైలు నెంబరు 17281)కు పుట్లచెరువు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. కాత్రా-కన్యాకుమారి (రైలు నెంబరు 16318)కు గూడూరు జంక్షన్‌లో, విజయవాడ-కాకినాడ పోర్టు (రైలు నెంబరు 17257)కు పసివేదల స్టేషన్‌లో, విజయవాడ-మచిలీపట్నం (రైలు నెంబరు 07866)కు ఉప్పులూరు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. భువనేశ్వర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17015)ను నడికుడి స్టేషన్‌లో, భువనేశ్వర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17015)కు పిడుగురాళ్ల, సత్తెనపల్లి స్టేషన్లలో స్టాపింగ్ కల్పించారు. నాగర్‌సోల్-నర్సాపూర్ (రైలు నెంబరు 17232)కు కూడా సత్తెనపల్లి స్టేషన్‌తో పాటు నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. ధర్మవరం-రేపల్లె (రైలు నెంబరు 17216)కు గిద్దలూరు స్టేషన్‌లో, లింగంపల్లి-నర్సాపూర్ (రైలు నెంబరు 17256), చెంగల్‌పట్టు-కాకినాడ (రైలు నెంబరు 17643)కు మంగళగిరి స్టేషన్‌లో హాల్ట్ కల్పించారు. ధర్మవరం-మచిలీపట్నం (రైలు నెంబరు 17216)ను మార్కాపురం రోడ్డు స్టేషన్‌లో, భువనేశ్వర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17015)కు మిర్యాలగూడ స్టేషన్‌లో, నర్సాపూర్-లింగంపల్లి (రైలు నెంబరు 17255)కు నల్గొండ స్టేషన్‌లో, చెంగల్‌పట్టు-కాకినాడ (రైలు నెంబరు 17643)ను న్యూ గుంటూరు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. యశ్వంత్‌పూర్-మచిలీపట్నం (రైలు నెంబరు 17212)కు కంబం స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. నాగర్‌సోల్-నర్సాపూర్ (రైలు నెంబరు 17232)కు మిర్యాలగూడ, నల్గొండలో హాల్ట్ ఇచ్చారు. నాగర్‌సోల్-చెన్నై (రైలు నెంబరు 16004)కు మహబూబ్‌నగర్‌లో, సికింద్రాబాద్-రాయ్‌పూర్ (రైలు నెంబరు 17271), రాయ్‌పూర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17272)కు పెద్దపల్లిలో స్టాపింగ్ ఇచ్చారు. చెన్నై సెంట్రల్-నిజాముద్దీన్ (రైలు నెంబరు 12611), నిజాముద్దీన్-చెన్నై సెంట్రల్ (రైలు నెంబరు 12612)కు వరంగల్‌లో, అహ్మదాబాద్-చెన్నై సెంట్రల్ (రైలు నెంబరు 12655)కు పెద్దపల్లిలో హాల్ట్ కల్పించారు.

తల్లిపై పైశాచికం

- తాగిన మత్తులో కొడుకు లైంగిక వేధింపులు
- భరించలేక తల్లే రోకలిబండతో కొట్టి హతం
- తాడంకి యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ


రాంబాబు (ఫైల్)

పమిడిముక్కల, జూలై 18 : మద్యం మత్తు పేగు బంధానికి పాతరేస్తుంది. వావీవరసలకు సమాధి కడుతుంది. మానవ సంబంధాలనే శాశిస్తుంది. పమిడిముక్కల మండలం తాడంకిలో యువకుడి హత్య కేసే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. 24 గంటల్లో ఈ కేసును పోలీసులు తేల్చేశారు. కన్న కొడుకు వికృత్యాన్ని భరించలేని తన బిడ్డను తానే హత్యచేసినట్టు తల్లి అంగీకరించింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడంకి బీసీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి గండికోట రాంబాబు (35) హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి తల్లి పద్మ కాళ్లు చేతులు కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కి.. పక్కగదిలో నిద్రిస్తున్న ఆమె కొడుకు రాంబాబు తలపై కొట్టి చంపారన్న ప్రాథమిక సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. తల్లి నుంచి పొంతన లేని సమాధానాలు రావడంతో తనయుడిని ఆమే హత్య చేసినట్టు పోలీసులకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో పద్మను పూర్తిస్థాయిలో విచారించగా కొడుకు వేధింపులు తాళలేక తలపై కొట్టిచంపినట్టు ఆమె అంగీకరించింది. ఈ క్రమంలోనే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాంబాబు మద్యం సేవించి ఆ మత్తులో తల్లి పట్ల తరచూ అసభ్యంగా ప్రవర్తిం చేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రాంబాబు మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించడమేకాక లైంగికంగానూ వేధించాడు. ఆమె తప్పించుకుని చీకటిలో ఓ చోట దాక్కుంది. రాంబాబు తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. కొడుకు చేష్టలు భరించలేక ఆ తల్లి రోకలిబండతో అతని తలపై బలంగా మోది చంపింది. హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు నవారుతో తన కాళ్లు, చేతులు తనే కట్టుకుని మెడలో తుండు చుట్టుకుని గుర్తుతెలియని వ్యక్తులు చంపినట్టు సృష్టించానని చెప్పింది. ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్టు పోలీసులు తెలిపారు.

కలుషిత నీటిపై కదిలిన యంత్రాంగం

- వెంకటనరసింహాపురంలో మంచినీటి శాంపిళ్ల పరిశీలన
- మంచినీటి పైపులైను పునరుద్ధరణ, క్లోరినేషన్‌కు చర్యలు

గన్నవరం, జూలై 18 : కేసరపల్లి పంచాయతీ వెంకట నరసింహాపురంలో మంచి నీటిని జిల్లా యంత్రాంగం గురువారం పరిశీలించింది. డ్రెయినేజీ నీరు మంచినీటి పైపుల ద్వారా ఇంటింటికీ సరఫరా అయిన ఉదంతాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గన్నవరం ఎండీవో ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది వెంటనే స్పందించారు. డ్రెయినేజీ గుంటల వద్ద పగిలిన పైపులైన్లను పునరుద్ధరించారు. డ్రెయినేజీ నీరు రాకుండా పైపులను తొలగించి, సీల్ మూతలు బిగించారు. కొత్త పైపులు వేసే పనులు చేపట్టారు. కేసరపల్లి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ నేతృత్వంలోని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది కూడా స్పందించి కాలనీకి సరఫరా అయ్యే నీటిని పలుమార్లు క్లోరినేషన్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి వాటర్ శాంపిల్స్ పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీ లీకేజీల మరమ్మతులు చేయాలని స్థానికులు చెబుతున్నారు. డ్రెయినేజీ కాల్వలు లేవు కాబట్టి, పైపులైన్లు ఏర్పాటు చేయటం ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలంటున్నారు.


ఇళ్లలో నీటిని పరీక్షిస్తున్న అధికారి


జిల్లా కోర్టుసెంటర్‌లో మానవహారం, (ఇన్‌సెట్‌లో) ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ, జిల్లా జడ్జి అరుణాసారిక

హెల్మెట్ భారం కాదు రక్షణ

ర్యాలీని ప్రారంభించిన జిల్లా జడ్జి అరుణ సారిక, కలెక్టర్ బాలాజీ

హెల్మెట్ ధారణ ఏమీ భారం కాదని, ప్రాణానికి రక్షణ అని జిల్లా జడ్జి అరుణసారిక, కలెక్టర్ బాలాజీ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 1కే రన్ జిల్లా జడ్జి, కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కోర్టు నుంచి రేవతి టాకీసు సెంటర్ వరకు నిర్వహించిన 1కే రన్‌లో న్యాయమూర్తులు, వివిధ శాఖల ఉద్యోగులు, న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు. హెల్మెట్ ధారణ- ప్రాణానికి రక్షణ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య పాల్గొన్నారు.

- మచిలీపట్నం టౌన్

కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం జీవోఆర్‌టీ నెంబరు 122 జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆయన కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాకినాడ జేఎన్‌టీయూలో 1999లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. ప్రతి పనిలోనూ పారదర్శకంగా ఉండే శ్రీనివాసరావును కూటమి ప్రభుత్వం ఎంచుకుని మరీ కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించినట్టు సమాచారం. ఈనెల 20వ తేదీన కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపడతానని ఆయన తెలిపారు. కాకినాడ జెఎన్‌టీయూలో పనిచేస్తున్న శోభన్‌బాబు ప్రస్తుతం కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. కృష్ణా యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లు ఇద్దరూ కాకినాడ జేఎన్‌టీయూ నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. ఇప్పటివరకు వీసీగా పనిచేసిన జ్ఞానమణి ఏడాదికాలం పాటు పనిచేశారు. గతంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ రామ్మోహనరావు ఏడునెలల పాటు కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా పనిచేశారు.




నూతన వీసీకి సమస్యల స్వాగతం

కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వస్తున్న శ్రీనివాసరావుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కృష్ణా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ తుది పరీక్షా ఫలితాలను వెల్లడించకుండా మూడునెలలుగా నిలిపివేశారు. 42 మంది విద్యార్థులు పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరు. దీంతోపాటు యూనివర్సిటీలో బాలుర, బాలికల వసతిగృహాలు, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల భవనాల పనులు నిలిచిపోయాయి. రెండు సంవత్సరాలుగా ఈ పనులు నిలిచిపోయినా గతంలో పనిచేసిన వీసీలు, రిజిస్ట్రార్‌లు అంతగా పట్టించుకోలేదు. ఈ భవనాల నిర్మాణ పనులు జరగకున్నా బిల్లులు మాత్రం చెల్లించారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టాల పంపిణీలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. నూతన వీసీ ఈ అంశాలపై దృష్టి సారించాలని పలువురు అధ్యాపకులు కోరుతున్నారు.

ప్రేమోన్మాది వీరంగం

పోలీస్ స్టేషన్‌లో సామగ్రి ధ్వంసం

6లో..



జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

పార్టీ సభ్యుడికి రూ.5 లక్షల బీమా

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

వన్‌టౌన్, జూలై 18 : జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించారని, ఇది కార్యకర్తలకు గొప్ప సదుపాయమని పౌరసరఫరాలశాఖ మంత్రి, పార్టీ రాజకీయ కలాపాల చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం విజయవాడ భవానీపురం 40వ డివిజన్‌లోని ఫంక్షన్ హాలులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఐదు లక్షల బీమా కల్పించడం పవన్‌కల్యాణ్ గొప్ప మనస్సుకు నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా మృతి చెందిన ఇద్దరు జనసైనికుల కుటుంబాలకు బీమా పరిహారం చెక్కులను అందజేశారు. 40వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గంలో పదివేల మందిని సభ్యులుగా చేర్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కల్యాణం శ్రీనివాసరావు, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు. మనోహర్‌ను నాయకులు సత్కరించారు.

పెద్దల సభ గౌరవానికే కళంకం..

విజయసాయి రెడ్డి తీరుపై కేశినేని శివనాథ్ విమర్శ



నందిగామ, జూలై 18 : నీచమైన కార్యకలాపాలతో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పెద్దల సభ గౌరవానికి భంగం కలిగిస్తున్నాడని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వయస్సును, పదవిని కించపరుస్తూ విజయసాయిరెడ్డి నీచమైన పనులు చేస్తున్నాడన్నారు. చేసిన తప్పుకు సిగ్గుపడాల్సిన ఆయన మీడియాను దూషించడం హేయమన్నారు. ప్రజలకు నిర్భయంగా నిజాలు తెలియజేస్తున్న మీడియా యాజమాన్యాలు, ప్రతినిధులను ఆయన దూషించిన విధానం హేయమన్నారు. వైసీపీలో అటువంటి కీచకులు ఎంతోమంది ఉన్నారని, అదొక సిగ్గుమాలిన పార్టీ అన్నారు. అటువంటి వ్యక్తులు రాజకీయాలలో ఉండడం దారుణమన్నారు. ఇప్పటికైనా విజయసాయిరెడ్డి తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని, మీడియాను క్షమాపణలు కోరాలని ఆయన సూచించారు.

సతీష్ రెడ్డికి తెలుగు వైభవ పురస్కారం



అవనిగడ్డ, జూలై 18 : భారత రక్షణ మంత్రి సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్, అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ రెడ్డిని మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారానికి ఎంపిక చేసినట్టు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతిని పురస్కరించుకుని గాంధీక్షేత్రంలో ఆగస్టు 4వ తేదీన జరిగే కార్యక్రమంలో సతీష్ రెడ్డికి ఈ పురస్కారాన్ని అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ పురస్కారం కింద సతీష్ రెడ్డికి లక్ష నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తారని తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రముఖ సినీ గాయని పి.సుశీల, ప్రపంచ ప్రసిద్ధ కేన్సర్ వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయలు అందుకున్నారని, భారతదేశానికి అబ్దుల్ కలాం తర్వాత ఆయన స్థాయిలో సేవ చేసిన సతీష్ రెడ్డిని ఈసారి మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం అందజేసే అవకాశం రావటం పట్ల బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.



ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి వినతి పత్రం ఇస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు


రైతుహిత విధానాలు అమలు చేయండి

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు రైతు సంఘాల వినతి

విద్యాధరపురం, జూలై 18 : రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర రావాలంటే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేసి రైతుహిత విధానాలను అమలు చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి చేసింది. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సమన్వయ సమితి కన్వీనర్, ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయమంత్రిగా పనిచేసిన వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏపీ రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, సమన్వయ సమితి నాయకులు సింహాద్రి ఝాన్సీ, ఎం.యలమందరావు, మరీదు ప్రసాదబాబు, పీవీ ఆంజనేయులు, చల్లపల్లి విజయ, దడాల సుబ్బారావు, కోగంటి కోటయ్యలు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. తొలుత ఎంపీకి శుభాకాంక్షలు తెలిపి అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందచేశారు. 2020-2021లో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం చేర్చి మద్దతు ధర నిర్ణయించాలన్నారు. స్వామి నాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానాన్ని, 2022లో చేసిన విద్యుత్ ప్రైవేటీకరణ చట్టంను రద్దు చేయాలని, వ్యవసాయానికి సంబంధించిన అన్ని వస్తువులపైన జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. భూసేకరణ సమయంలో ప్రతి ఏడాదీ పెరిగే ధరలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రైతులు, కార్మికులకు ఒకేసారి రుణ విముక్తి కలుగ చేయాలన్నారు. రైతుల ఉద్యమంలో చనిపోయిన 736 మంది రైతుల జ్ఞాపకార్థం స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని, రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని కోరారు. దీనిపై శివనాథ్ స్పందిస్తూ ప్రధాన డిమాండ్లను పార్లమెంట్‌లో ప్రస్తావించడంతోపాటు కేంద్ర వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు.

వసతి గృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు

సెక్యూరిటీ గార్డు చొరవతో నున్న పోలీసులకు అప్పగింత



పాయకాపురం, జూలై 18 : ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు గురువారం నున్న రూరల్ స్టేషన్‌కు చేరారు. ఓ సెక్యూరిటీ గార్డు చొరవ చూపి బాలికలను సురక్షితంగా పోలీసులకు అప్పగించాడు. వెస్ట్ డీసీపీ టి.హరికృష్ణ గురువారం నున్న రూరల్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ కథనం మేరకు.. నగరానికి చెందిన ముగ్గురు బాలికలు ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. బాలికలది విజయవాడ కావడంతో అక్కడ ఉండటం ఇష్టం లేక తల్లిదండ్రులను చూడాలని భావించారు. అనుకున్నట్టుగా గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా వసతి గృహం నుంచి బయటకు వచ్చేశారు. కొంతదూరం నడుచుకుని వచ్చిన తరువాత ఆగిరిపల్లి వద్ద విజయవాడ బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ఆగిరిపల్లి నుంచి నున్న గ్రామంలోని రిలయన్స్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కూరపాటి రాజేష్ ముగ్గురు బాలికలను గమనించాడు. వారితో పాటు బస్సు ఎక్కిన రాజేష్ బాలికలతో మాట్లాడి వారు పారిపోతున్నారని తెలుసుకుని బస్సు కండక్టర్, డ్రైవర్లకు చెప్పి అప్రమత్తం చేసి నేరుగా నున్న రూరల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సు ఆపి ముగ్గురు బాలికలను పోలీసులకు అప్పగించాడు. డీసీపీ బాలికలతో మాట్లాడి విషయం తెలుసుకుని బాలికల తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికలను బాధ్యతగా పోలీసులకు అప్పగించినందుకుగాను డీసీపీ సెక్యూరిటీ గార్డు రాజేష్‌ను సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. అలాగే బాలికలు వసతి గృహం నుంచి వెళ్లిపోవడానికి గల కారణాలను విచారిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ దుర్గా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ

నగరంలో న్యాయాధికారుల అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధరించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

విజయవాడ లీగల్, జూలై 18 : బెజవాడ బార్ అసోసియేషన్, మండల న్యాయసేవాధికార సంస్థ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) సంయుక్త అధ్వర్యంలో 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి..' అని ప్లకార్డులు ధరించి న్యాయమూర్తులు, న్యాయవాదులు పెద్దఎత్తున సిటీ సివిల్ కోర్టుల నుంచి ఐదో నెంబరు రోడ్డు, మ్యూజియం రోడ్డు, బందరురోడ్డు మీదుగా గురువారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.సత్యానందం, రాష్ట్ర బార్‌కౌన్సిల్ మెంబర్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం భారం కాదని, అది మనకు ఇచ్చే 'రక్షణ' అని తెలిపారు. 'హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ' అంటూ న్యాయమూర్తులు, న్యాయవాదులు నినాదాలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హైకోర్టు ఉత్వర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని, లేకుంటే కేసుల నమోదు, భారీ మొత్తంలో జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరిస్తే అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. జరగబోయే ప్రమాదాలను ముందుగా ఊహించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. యజమాని లేకపోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదముందని హెచ్చరించారు. అందరి క్షేమం కోసం అన్ని ప్రభుత్వ శాఖలు, కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు సత్యానందం, అజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారులు, బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివ రాంప్రసాద్ (రాజా), ఉపాధ్యక్షుడు గందూరి రామశర్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

సహ పాఠ్య బోధనతో సమగ్రాభివృద్ధి

ఉన్నత కెరీర్ దిశగా విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయాలి

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 18 : టీచింగ్ ప్లాన్ ప్రకారం విద్యార్థులకు విద్యానైపుణ్యాలు అందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడే సహపాఠ్య కార్యక్రమాల ద్వారా జీవన నైపుణ్యాలు అందించాలని, ఇందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను అనుసరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ శాఖల పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యుత్తమ బోధన ప్రణాళిక ద్వారా విద్యను అందించడంతో పాటు కో-కరిక్యులం కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకొనేందుకు అందుబాటులో వున్న అవకాశాలు, మార్గాలు, లక్ష్య సాధనకు అనుసరించాల్సిన ప్రణాళిక తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకర జీవన విధానంపై దృష్టిసారించేలా సేంద్రీయ వ్యవసాయంపైనా అవగాహన పెంపొందించాలన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకొనేలా కిచెన్ గార్డెనింగ్‌లో 6వ తరగతి, ఆపై తరగతుల విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. ఇలాంటి కార్యకలాపాల్లో భాగస్వాములు కావడం వల్ల విత్తన నిర్వహణ, మృత్తికా సంరక్షణ, సేంద్రీయ ఎరువులు, ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులు ఇలా వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకొనేందుకు వీలుంటుందన్నారు. వివిధ విభాగాల్లో నిపుణులను ఆహ్వానించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని 1,475 అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో వున్న స్థలం ఆధారంగా కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్థలం అందుబాటులో లేకుంటే గ్రో బ్యాగ్స్ ద్వారా ఆకుకూరలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్, రక్తహీనత సమస్య వున్న గర్భిణులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాలపై షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సృజన ఆదేశించారు. సమావేశంలో డీఈఓ యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ సృజన

పర్యాటకం, క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి

కృష్ణలంక : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఆర్థిక వ్యవస్థ, ఉపాధికి చోదక శక్తిగా పర్యాటక రంగం నిలుస్తోందని, అదేవిధంగా క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, ఈ నేపథ్యంలో పర్యాటక, క్రీడారంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్టు కలెక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పర్యాటకం, క్రీడా రంగాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు, క్రీడా మైదానాలు, శిక్షణ జరుగుతున్న తీరు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటకులను ఆకర్షించేందుకు ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. కొండపల్లి ఫోర్ట్ ట్రెక్కింగ్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కొండపల్లి బొమ్మల కళాకారులను ప్రోత్సహించేలా, ఆ కళకు మరింత ఆదరణ లభించేలా ఆ ప్రాంతాన్ని టూరిజం కోణంలో అభివృద్ధి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. అదేవిధంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వివిధ క్రీడల్లో అందిస్తున్న శిక్షణ, అందుబాటులో వున్న కోచ్‌లు, మౌలిక వసతులపై చర్చించి క్రీడారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. త్వరలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సందర్శించనున్నట్టు తెలిపారు. విద్యాధరపురం స్టేడియం అభివృద్ధి ప్రణాళిక, డీఎస్ఏ పరిధిలోని మైదానాల వినియోగం తదితరాలపై సమావేశంలో చర్చించారు. జిల్లా టూరిజం అభివృద్ధి అధికారి బి.గోపాల్, డివిజనల్ మేనేజర్ (విజయవాడ) కృష్ణచైతన్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొనేంత.. లాభాలు కావాలా!

మనుషులను చంపి.. మీ బిడ్డలకు కూడు పెడతారా?

చట్టానికి అతీతంగా వెళితే శిక్షపడేలా చేస్తాం

క్వారీ లీజుదారులతో కలెక్టర్ సృజన ప్రత్యేక సమావేశం

పరిటాల ఘటన నేపథ్యంలో లీజుదారులకు తీవ్ర హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): 'మనుషులను బలిచేసేంత లాభాలు కావాలా? పాప పుణ్యాలు అనేవి మీకు ఉండవా? మనం కూడా మనుషులమే! మనకూ కుటుంబాలు ఉన్నాయి కదా! ఇంకొకరిని బలి తీసుకుని మనింట్లో వారికి అన్నం పెట్టాలనుకోవాలన్న ధోరణి ఏమిటి? మనుషులను చంపి ఆ డబ్బును మన కుటుంబాలకు పెడదామా? ఇది ఎంత వరకు మీకు సమంజసం? అందరినీ మేనేజ్ చేద్దామనుకుంటే కుదరదు.. క్వారీయింగ్‌లో తప్పు జరిగితే సహించేది లేదు. చట్టానికి అతీతంగా వెళితే శిక్ష పడేలా చేస్తాం' అంటూ క్వారీ లీజుదారులపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన నిప్పులు చెరిగారు. పరిటాల శివారు క్వారీలో ఇటీవల జరిగిన దుర్ఘటన నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వారీ లీజుదారులతో గురువారం రాత్రి కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్వారీ దుర్ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ క్వారీ లీజుదారుల చర్యలపై భగ్గుమన్నారు. వ్యాపారం లాభం కోసం చేస్తారు కానీ, మనుషులను బలిచేసేంత వ్యాపారం చేస్తారా అని నిలదీశారు. క్వారీయింగ్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. చట్టానికి వ్యతిరేకంగా ఏ చర్య జరిగినా శిక్షపడేలా చేస్తానన్నారు. అందరినీ మేనేజ్ చేద్దామనుకుంటే కుదరదన్నారు. ఇకపై క్వారీయింగ్‌లో మానవ తప్పిదం జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో 154 క్వారీలు నమోదై ఉన్నాయని, వీటిలో 69 క్వారీలలో రోడ్ మెటల్‌కి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నాయని, మిగిలిన 85 క్వారీలలో ఎలాంటి కార్యకలాపాలు సాగటం లేదన్నారు. క్వారీల పరిశీలన కోసం విధిగా చివరి వరకు రోడ్డు ఉండాల్సిందేనన్నారు. ప్రతి క్వారీకి సెల్ఫ్ ఆడిట్ తప్పనిసరాన్నరు. రక్షణాత్మకంగా నిర్వహించలేని క్వారీలను నిలుపుదల చేస్తామన్నారు. క్వారీ దారులకు వారం రోజులు సమయం ఇస్తున్నామని, ఈ లోగా రక్షణకి సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికను గనుల శాఖకు అందచేయాలన్నారు. క్వారీలలో పనిచేసే కార్మికులు , ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల పూర్తి వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం ఉండాల్సిన రిజిస్టర్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సేఫ్టీ ఆడిట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశం గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జీ వెంకటేశ్వర్లు, ఏడీ కే వీరాస్వామి తదితరులు ఉన్నారు.

బాబోయ్.. కర్మాగారాలు!



సిమెంట్ ఫ్యాక్టరీలో వాహనం ఢీకొని కార్మికుడి మృతి

వరుస ప్రమాదాలతో గ్రామస్థుల ఆందోళన

జగ్గయ్యపేట రూరల్, జూలై 18 : సిమెంట్ కర్మాగారాలలో వరుస ప్రమాదాలపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఫ్యాక్టరీలలో రోజువారీ కూలీలు మృతి చెందటంపై కర్మాగారాల నిర్వహణను ప్రజలు సందేహిస్తున్నారు. గత వారం బూదవాడలోని అల్ట్రాటెక్ కరాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో 16 మందికి తీవ్ర గాయాలు కాగా వారిలో నలుగురు మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానికంగా రామ్‌కో సిమెంట్స్‌లో ప్రమాదంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. రూ.కోట్లు వెచ్చించి కర్మాగారాలు నిర్మిస్తున్న యాజమాన్యాలు అదేస్థాయిలో కార్మికుల ప్రాణాలు, వారి కుటుంబాలకు విలువ ఇవ్వటం లేదని ఆరోపిస్తున్నారు. కర్మాగారం ఉన్న గ్రామాలలో సింహ భాగం గిరిజన ఆవాస ప్రాంతాలు కావటం కర్మాగారాలకు కల్పవృక్షంలా మారింది. విద్యార్హత, పనులపై స్కిల్ లేని కార్మికులను తక్కువ వేతనానికి తీసుకుంటూ తమ పబ్బం గడుపుకునేందుకు స్థానిక నాయకుల చెప్పు చేతుల్లో ఉండే కాంట్రాక్టర్‌లను ప్రోత్సహిస్తున్నారు. తక్కువ వేతనానికి వచ్చే వారినే కాంట్రాక్టర్‌లు పనులకు పంపుతుండటంతో తరచు ప్రమాదలు జరుగుతున్నాయి.

ఒక విధంగా కర్మాగారాలు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. రామ్‌కో సిమెంట్స్‌లో 70 మందికిపైగా కాంట్రాక్టర్‌ల అవతారమెత్తిన వ్యక్తులు ఆయా రాజకీయ పార్టీల నాయకుల అనుచరులే. వీరు రోజుకు 2000ల మందికి పైగా కార్మికులను కర్మాగారాలలోని పనులకు పంపుతున్నట్టు సమాచారం. పనుల పట్ల వారికి అవగాహన లేకపోవటంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు అంటున్నారు.

నాగులు (45)కు భార్య జ్యోతి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె సంధ్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా రెండవ కుమార్తె దివ్యకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. కుమారుడు నరసింహ ఇంటర్ పూర్తి చేసుకునిపై చదువులకు తయారవుతున్నాడు. భార్య జ్యోతి కూడా కూలీ పనులకే వెళ్తుంది. సంధ్యకు వివాహం కుదిరిందని మరో 15 రోజుల్లోనే ముహూర్తం నిర్ణయించటమైందని, పనుల్లో కుటుంబ సభ్యుల తలమునకలు కాగా కుటుంబ పెద్ద మృతి చెందటం విషాదాన్ని నింపింది.

కర్మాగారంలో వాహనం ఢీకొని కార్మికుడి మృతి

జగ్గయ్యపేట రూరల్, జూలై 18 : రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో గురువారం రోజువారీ కూలీ మూడు నాగులు (45)ను కర్మాగారంలో క్లీనింగ్ చేసే వాహనం ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ప్రధాన గేటు ఎదుట గ్రామస్థుల ఆందోళన

జయంతిపురం గ్రామానికి చెందిన నాగులు మృతిపై గ్రామస్థులు రామ్‌కో సిమెంట్స్‌కు చెందిన ధర్మవరప్పాడుతండా గ్రామంలోని ప్రధాన గేటు ఎదుట నాగులు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ జానకిరామ్, ఎస్ఐ సతీష్‌లు కర్మాగారం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్డీవో రవీంద్రరావు, తహసీల్దార్ శేషగిరిలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



న్యాయం కోరుతూ కర్మాగారం ఎదుట గ్రామస్థుల ఆందోళన



ఎంపీడీవో కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ఎంపీడీవో కోసం ప్రత్యేక బృందాల గాలింపు

కొనసాగుతున్న ఎన్డీఆర్ఎఫ్ సెర్చ్ ఆపరేషన్

డీఐజీ పర్యవేక్షణలో కృష్ణా ఎస్పీ దర్యాప్తు

పెనమలూరు, జూలై 18 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవోగా విధుల నిర్వహిస్తూ అదృశ్యమైన మండవ వెంకట రమణారావు కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్టు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు గురువారం తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు రమణారావు మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో 55 లక్షల బకాయిల విషయంలో తీవ్ర ఒత్తిడికి గురైనట్టు తెలిసిందని ఎస్పీ తెలిపారు. అలాగే కొన్ని ఫోన్‌ల నుంచి కాల్స్ వచ్చినట్లు, ఆ కాల్స్ విషయంలో మరింత ఒత్తిడికి గురైనట్టు, కొంత డబ్బును ఆ కాలర్స్‌కు బ్యాంకు ద్వారా జమ చేసినట్టు తెలిసిందన్నారు. వీటన్నింటి మీద పూర్తి స్థాయి దర్యాప్తు జరుగున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు, గాలింపు చర్యలకు ప్రత్యక్ష పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 150 మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం దర్యాప్తును పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీఅద్నాన్ నయీం అస్మి సహకారంతో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ పర్యవేక్షిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. అదృశ్యమైన ఎంపీడీవో సమాచారాన్ని 9440797400, 9440627051, 9491063910 నంబర్లకు తెలియపరచాలని కోరారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జూలై 18 : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబసభ్యులతో కలిసి గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు ఆలయ మర్యాదలు కల్పించగా దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందచేశారు.

అమ్మవారిని దర్శించుకున్న పాండిచ్చేరి హోంమంత్రి

పాండిచ్చేరి హోంమంత్రి ఎ.నమశ్శివాయం కుటుంబసభ్యులతో కలిసి గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

విజయవాడ మొగల్రాజపురం బీఎం రావు వీధికి చెందిన జేఎం కృష్ణారావు కుటుంబసభ్యులతో కలిసి దుర్గగుడిలో అన్న వితరణకు రూ. 1,11,111లు విరాళం చెక్కును ఈవో రామారావు ద్వారా ఆలయానికి అందజేశారు. కోట ఉమాదేవి రూ 50,116 అన్న వితరణకు విరాళం అందజేశారు.

గురుకులాల్లో పార్ట్‌టైం టీచర్ల నియామకం

విజయవాడ లీగల్, జూలై 18 : ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పార్ట్ టైం గెస్ట్ టీచర్ల భర్తీ కోసం ఈనెల 23వ తేదీన జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో డెమో నిర్వహించనున్నట్టు జిల్లా సమన్వయ అధికారి కె.ప్రేమావతి తెలిపారు. ఖాళీల వివరాలు.. కృష్ణారావుపాలెం (బాలురు) జెఎల్ కెమిస్ట్రీ, జెఎల్ ఫిజిక్స్, రుద్రవరం (బాలురు) జెఎల్ కెమిస్ట్రీ, టీజీటీ ఇంగ్లీష్, మోటూరు (బాలికలు) జేఎల్ కెమిస్ట్రీ, పీజీటీ మాథ్స్, పీఈటీ, రంగాపురం (బాలికలు) టీజీటీ ఇంగ్లీష్, ముప్పాళ్ల (బాలికలు) హెచ్ఎస్, పీజీటీ మాథ్స్, జెఎల్ ఇంగ్లీష్, జెఎల్ జువాలజీ, నర్సాపురం (బాలికలు) పీఈటీ, తిరువూరు (బాలురు) పీఈటీ, జెఎల్ బోటనీ, బల్లిపర్రు (బాలికలు) పీజీటీ, తెలుగు, చల్లపల్లి (బాలికలు) జెఎల్ కెమిస్ట్రీ.

అర్హతలు : బీఈడీ, పీజీ, టెట్ పూర్తి అయిన వారు మాత్రమే అర్హులు. పీఈటీ పోస్టుకు బీపీఈడీ అర్హత, హెచ్ఎస్ పోస్టుకు జీఎన్ఎం అర్హత కలిగి వుండాలి. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాను జిల్లా సమన్వయ అధికారి కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్ కాంపౌండ్, గోపాల రెడ్డి రోడ్డు, సీఎస్ఐ చర్చి ఎదురు, విజయవాడ నందు ఇవ్వాలి. బాలుర పాఠశాలకు బాలురు పార్ట్ టైం గెస్ట్ టీచర్లను మాత్రమే తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

ప్రేమోన్మాది వీరంగం

గుడివాడ, జూలై 18 : మద్యం మత్తులో ప్రేమోన్మాది మిత్రుడితో కలిసి వీరంగం సృష్టించాడు. ఏకంగా పోలీస్ స్టేషన్‌లోని సామగ్రిని ధ్వంసం చేసి అడ్డొచ్చిన పోలీసులపై చెయ్యి చేసుకున్నాడు. తొలుత ప్రేమించిన యువతి కుటుంబంపై దౌర్జన్యం చేశాడు. టూటౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గుడ్‌మెన్‌పేటకు చెందిన వేమూరి జాన్‌హెన్రీ ఇంజనీరింగ్ చదువుతున్న యువతి వెంటపడి వేధిస్తున్నాడు. దీంతో యువతి తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. బుధవారం ఏకదశి సందర్భంగా యువతి తల్లిదండ్రులతో కలిసి స్థానిక గీతా భవన్‌కు వెళ్లింది. హెన్రీ మిత్రుడు కిరణ్‌తో కలిసి గీతాభవన్‌కు చేరుకుని యువతి కుటుంబీకులపై దాడికి దిగాడు. స్థానికులు అడ్డుకుని అక్కడే ఉన్న టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్స్ వారిద్దరిని స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లోనూ హెన్రీ ఫోన్‌ను, వాకీటాకీ, పూలకుండీలను ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో ఉన్న హెన్రీ తీవ్ర పదజాలంతో దుర్భలాషడుతూ స్టేషన్ సిబ్బందిపై దాడి చేస్తూ నానాబీభత్సం సృష్టించాడు. హెన్రీ, ధనియాటపేటకు చెందిన బంటుమిల్లి చైతన్య రఘు చరణ్‌లపై పలు సెక్షన్‌ల కింద కేసును నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ ఎం.ఎస్ దుర్గారావు తెలిపారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఇరువురికి 14రోజుల రిమాండ్ విధించారని, వారిని మచిలీపట్నంలోని సబ్‌జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 123, 133
చికెన్ విత్ స్కిన్	218
చికెన్ స్కిన్‌లెస్	228

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

విజయసాయిరెడ్డిని తక్షణం అరెస్టు చేయాలి : టీడీపీ

కంకిపాడు : భూకబ్జాలు, మీడియా ప్రతినిధులపై దాడికి దిగిన ఎంపీ విజయసాయిరెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని మండల టీడీపీ కార్యదర్శి పులి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కంకిపాడు పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ కబ్జాలకు పాల్పడుతూ, అక్రమ సంబంధంతో అడ్డంగా దొరికిపోయిన విజయసాయి రెడ్డి మీడియా ప్రతినిధులపై విషం కక్కుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని అడ్డగోలుగా దోచుకున్న విజయసాయిరెడ్డి భాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు షేక్ బాజి, ఏనుగ జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



జగదాంబకు ఆషాఢ సారె

ఉయ్యూరు, జూలై 18 : ఆషాఢమాసంపురస్కరించుకుని ఉయ్యూరు జగదాంబ అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణ భక్తబృందం ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ సారె సమర్పించారు. శివాలయం రోడ్డు నుంచి ప్రధాన సెంటర్, పాతస్టేట్ బ్యాంక్ రోడ్డు, రావిచెట్టు సెంటర్ నుండి మేళతాళాలతో ఆలయానికి భారీ ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారిని దర్శించి పసుపు కుంకుమ, సారె సమర్పించారు. ఆలయ అర్చకులు వాసు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ. 1.24 లక్షలు



హనుమాన్‌జంక్షన్, జూలై 18 : నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గడిచిన మూడు నెలల 20 రోజులకు హుండీలో రూ.1,24,153 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాస్ తెలిపారు. హుండీలో 10 అమెరికన్ డాలర్లు ఉన్నట్లు తెలిపారు. గన్నవరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఉయ్యూరు సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో ఆలయ ట్రస్టీలు కాకాని అరుణ బాబు, తవ్వా పూర్ణ, రంగబాబు, ఆరేపల్లి ప్రసాద్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ఉయ్యూరు : పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని ఉయ్యూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగసుబ్రమణ్యం అన్నారు. ఉయ్యూరుకు చెందిన ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని వై.లలితకు పులి శ్రీరామ్ కల్యాణ్ పంపిన రూ.10 వేల చెక్కును గురువారం సుబ్రమణ్యం అందజేశారు. కృషి, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని పేరుప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు. కేసీపీ జనరల్ మేనేజర్ వి.వి.పున్నారావు, రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాసరావు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్, క్లబ్ సభ్యులు జి.వెంకటేశ్వర్లు, ఎన్.అమర్నాథ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ విస్తరణ పథకంపై అవగాహన సదస్సు నేడు

గన్నవరం, జూలై 18: ఆయిల్ పామ్ విస్తరణ పథకంపై మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో శుక్రవారం హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి హరిచంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హాజరవుతున్నారన్నారు. సదస్సును సద్వినియోగం చేయాల్సిందిగా కోరారు.



పోరంకిలో జాతీయ రహదారిపై మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పెనమలూరు, జూలై 18 : వాతావరణంలో వేడిని తగ్గించి, ఆక్సిజన్ స్థాయిలు పెంచి పర్యావరణ హితాన్ని కోరుకునేది మొక్కలు మాత్రమేనని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి చేపల కుండీల సమీపంలోని జాతీయ రహదారి డివైడరుపై గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రపంచంలోనే పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ తయారీ అంతానికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలని పిలుపునిచ్చారు. పచ్చని చెట్లు, చక్కని పర్యావరణాన్ని మనం భావి తరాలకు అందించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, బొప్పన లావణ్య, మొవ్వ శేఖర్‌బాబు, గట్టు వాణి, వీరమాచినేని వాణి, శుభశేఖర్, చక్రవర్తి, సందీప్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల భూ దందాకు ప్రభుత్వం చెక్

హనుమాన్‌జంక్షన్ : వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దందాలపై అనేక అర్జీలు అందడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తెలిపారు. టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ దాదాపు 1.75లక్షల ఎకరాలు ఆక్రమణలకు గురైందన్నారు. వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఉచితంగా ఇసుకను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సమావేశంలో జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గండేపూడి నితీష్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మండాది రవీంద్ర , నాయకులు చెరుకూరి హరికృష్ణ, దయాల రాజీవ్‌కాంత్,కర్రా ప్రసాద్ పాల్,అక్కినేని రాఘవేంద్రరావు, కొత్తూరు ఆంజనేయులు ,ఆరేపల్లి సుబ్బారావు, బోడిచర్ల స్వామి, పొట్లూరి ఫణి ,చిన్ని తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

గన్నవరం, జూన్ 18 : ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయసేవ సాధికార కమిటీ ఛైర్మన్, జడ్జి జయలక్ష్మి అన్నారు. గన్నవరంలో ఎన్‌టీటీఎఫ్ విద్యార్థులతో కలసి గాంధీబొమ్మ సెంటర్ నుంచి గురువారం హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవటం వల్ల ప్రమాదాల బారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ఉంటే ప్రమాదం జరిగిన ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చన్నారు. ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, అనుమోలు వెంకటేశ్వరరావు, ఎస్సై శివ ప్రసాద్, ఎన్‌టీటీఫ్ మేనేజర్ కె.పద్మజ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు జయలక్ష్మి, శ్రీనివాసబాబు,



బాలుర హైస్కూల్‌కు క్రీడా పరికరాలు అందజేస్తున్న సత్యన్నారాయణరావు

పాఠశాలలకు క్రీడా పరికరాల వితరణ

గన్నవరం, జూలై 18 : క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హెచ్‌సీఎల్, హీల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తోడ్పాటునందిస్తున్నట్లు ఆ సంస్థ సమన్వయకర్త బి.సత్యన్నారాయణరావు అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బాలికల, కేసరపల్లి, దావాజీగూడెం, గొల్లనపల్లి పాఠశాలలకు రూ.35వేలు విలువ చేసే క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభగల క్రీడా ఆణిముత్యాలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో క్రీడా పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బాపులపాడు మండల సమావేశం నేడు

హనుమాన్‌జంక్షన్, జూలై 18 : బాపులపాడు మండల సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నగేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ముదునూరు సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉయ్యూరు : ముదునూరు సబ్‌స్టేషన్ పరిధిలో సాయిపురం 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

● రైతులకు అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం



జాతీయ రహదారిపై వెళ్తున్న దమ్ము చక్రాల ట్రాక్టర్

కంకిపాడు, జూలై 18 : దమ్ము చక్రాల తాకిడికి రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన రోడ్లు ధ్వంసమవుతున్నాయి. కేవలం రైతులకు అవగాహన లేక రోజూ పొలాలలకు దమ్ము చక్రాలు తగిలించుకొని ట్రాక్టర్లపై వెళ్తుంటడంతో ఈ పరిస్థితి నెలకొంది. రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రొద్దుటూరు, నెప్పల్లి, ఈడుపుగల్లు పునాదిపాడు, మద్దూరు, గొడవర్రు, కుందేరు గ్రామాల్లో రైతులు పొలాన్ని దమ్ము చక్రాలతో దున్నాల్సి ఉంటుంది. ఇందుకు ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను అమర్చి వెళ్తుండడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. రైతులు దమ్ము ట్రాక్టర్ చక్రాలకు రబ్బరు తొడుగులు లేదా మూడు అంగుళాల ఇనుక బద్దీలు అమర్చి నడిపితే రోడ్లు దెబ్బతినే అవకాశం ఉండదు. అవగాహన లేక రైతులు ట్రాక్టర్లు నడపడంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మిస్తున్న రోడ్లు మూన్నాళ్లకే ధ్వంసమవుతున్నాయి. దమ్ము ట్రాక్టర్లకు బద్దీ వేయకుండా రహదారులపైకి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.



బద్దీ వేయాలి

దమ్ము చక్రాల ట్రాక్టర్‌కు పావు గంట సమయం కేటాయించి మూడు అంగుళాల ఇనుప బద్దీ వేస్తే రోడ్లు ధ్వంసం కావని రైతు హరికృష్ణ తెలిపారు.



పిన్నమనేని ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి

డీఎంహెచ్‌వో పిన్నమనేని బోధనాస్పత్రి సందర్శన

గన్నవరం, జూలై 18 : చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ బోధనాస్పత్రిని గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ జి.గీతాబాయి సందర్శించారు. ఏఆర్‌టీ చట్టం ద్వారా సహాయ పునరుత్పత్తి సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సదుపాయాలను పరిశీలించారు. చట్ట ప్రకారం కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతి వైద్యశాల తప్పని సరిగా నమోదు చేసుకోవాలని డాక్టర్ గీతాబాయి అన్నారు. అసిస్టెంట్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ ప్రజల్లో వంధ్యత్వ సమస్య పరిష్కరించేందుకు దోహదం చేస్తుందన్నారు. సంతానోత్పత్తి చికిత్స చేయడానికి కావాల్సిన మానవ వనరులు, యంత్ర సామగ్రి, సాంకేతిక పరికరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు సమీక్షించి ధరల పట్టికను చూశారు. ఏఆర్‌టీ కేంద్రం ద్వారా అందజేసే సేవలను యాజమాన్యం నిర్వహించాల్సిన రికార్డుల వివరాలను తెలుసుకున్నారు. డాక్టర్ అనురాధ, డాక్టర్ వినీల్, డాక్టర్ ఎం.అపర్ణ, శైలజాదేవి, మస్తానమ్మ, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ మోదు వేగవంతం చేయండి : రాజా



కంకిపాడు, జూలై 18 : జనసేన పార్టీ సభ్యత్వ మోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా చేపట్టాలన్నారు. పార్టీ కార్యకర్తలకు ఉమ్మడి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను కూడా ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు బాయిన నాగరాజు, సుంకర శివ, కుంటా గంగాధర్, సుంకర సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పంట కాలువలను సొంత ఖర్చులతో బాగు చేసుకుంటున్న రైతులు

రైతుకు ఖర్చు తడిసి మోపెడు!



గొడవర్రులో నీట మునిగిన వరి

కంకిపాడు, జూలై 18 : రెండు మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతు పరిస్థితి దయనీయంగా మారింది. నాట్లకు సిద్ధమైన రైతులకు ఈ వర్షాలు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని గొడవర్రు, ఈడుపుగల్లు, పునాదిపాడు, కుందేరు, ఉప్పలూరు తదితర గ్రామాల్లో రైతులు నాట్లు వేసే పనిలో పడ్డారు. సుమారు 17 వేల హెక్టార్లలో వరి సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ వర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలిచి నాట్లు కూడా మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దుక్కి, నారు, నాట్లకు అయిన ఖర్చుతో సతమతమవుతున్న రైతన్నలకు సాగు కాలువలు అధ్వానంగా ఉండటంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు అధికారులు సకాలంలో స్పందించికపోవడంతో సాగు కాల్వలు బాగు చేత సైతం తమపై పడుతున్న అదనపు భారమని రైతులంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు కాల్వలు బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

20వ వార్డులో జంగిల్ క్లియరెన్స్



ఉయ్యూరు, జూలై 18 : ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి 20వ వార్డు కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి ఆధ్వర్యంలో వార్డులో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. రోడ్లపక్కన చెట్లు, పొదలు పెరిగి విద్యుత్ వైర్లకు తగులుతూ ప్రమాదకరంగా ఉన్న పరిస్థితుల్లో కౌన్సిలర్ ఆధ్వర్యంలో గురువారం కొమ్మలు, పొదలు నరికి శుభ్ర పరిచారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి మురుగు నీరు ప్రవాహానికి అడ్డు తొలగించారు. పి.చిరంజీవి, బండారు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 123, 133
చికెన్ విత్ స్కిన్	218
చికెన్ స్కిన్‌లెస్	228



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

కౌలు రైతులకు కార్డులు వెంటనే జారీ చేయాలి

మచిలీపట్నం టౌన్ : కౌలు రైతులకు కార్డులు వెంటనే జారీ చేయాలని బందరు నార్త్, సౌత్ తహసీల్దార్‌లు కె. విజయకుమార్, ఎన్. వెంకటేశ్వరరావు సూచించారు. నార్త్, సౌత్ మండలాల తహసీల్దార్లు మొదటిసారిగా వీఆర్వోలు, వ్యవసాయ శాఖాధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌కు వచ్చే గ్రీవెన్స్‌లపై సత్వర చర్యలు తీసుకోవాలని, నీటి తీరువా వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలన్నారు. ఆర్‌ఐ యాకుబ్‌తో పాటు మండల వ్యవసాయాధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తాం

మచిలీపట్నం టౌన్, జూలై 18 : టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్, భూగర్భ జల వనరుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా కోర్టుసెంటర్‌లోని ధాత్రి కన్వెన్షన్ హాలులో ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావును మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, గొర్రెపాటి సోనికా చంద్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీటీడీ ధర్మ ప్రచారిణి జొన్నలగడ్డ మాధవి, హిందూ ఐక్యవేదిక నిర్వాహకులు రామాంజనేయులు ఘనంగా సత్కరించారు. చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ, మచిలీపట్నంలో చారిత్రక పుణ్య క్షేత్రాలు ఉన్నాయని, వాటి ప్రాశస్త్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతం చేయాలన్నారు.



చాగంటి కోటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, సీనియర్ నేత గోపీచంద్

బందరును సుందర నగరం చేద్దాం

బందరును సుందర, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు శానిటేషన్ డ్రైవ్‌న్‌యుద్ధప్రాతిపదికన చేపట్టాలనిరాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం మునిసిపల్ అధికారులు, టీడీపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలతో మంత్రి రవీంద్ర నగర అభివృద్ధిపై సమీక్షించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, ఎండి ఇలియాస్ పాషా, కాంతారావు, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, గడ్డం రాజు, కర్రి మహేష్ తదితరులతో చర్చించారు. డ్రెయిన్లు, పైపులైన్ల లీకేజీలు, కల్వర్టుల సమస్యలను టీడీపీ నాయకులు మంత్రికి వివరించారు. బస్టాండ్ వెనుక కల్వర్టు పూడిపోయిందని, విశ్వబ్రాహ్మణ కాలనీలోని డ్రెయిన్లను పూడిక తీయించాలని కోరారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండ కుండా ఇంజన్లతో తోడించాలని మంత్రి సూచించారు. ఈనెల 22, 23 తేదీల్లో కేంద్ర బృందం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. కమిషనర్ బాపిరాజు, ఎంఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు నిర్మించాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థినులు 450కు పెరిగిన దృష్ట్యా లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని మంత్రి కొల్లు రవీంద్రకు లేడీయాంప్తిల్ కళాశాల అధ్యాపకులు వినతి పత్రం సమర్పించారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రి కొల్లు రవీంద్రను ప్రిన్సిపాల్ ఆనందకుమార్, అధ్యాపకులు రాం బాబు, హరనాథ్ సుందరలక్ష్మి తదితరులు కలసి కళాశాలకు అవసరమైన వనరులపై చర్చించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, తరగతి గదులకు ఆర్ అండ్ బి అధికారులతో ఎస్టిమేట్లు వేయిస్తే నిధులు తీసుకుని వస్తామని హామీ ఇచ్చారు.

గైర్హాజరైన అధికారులకు షోకాజ్

● పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు : మొవ్వ, తోట్లవల్లూరు మండల సమావేశాల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా

కూచిపూడి, జూలై 18 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరైన అధికారులకు షోకాజ్‌లు జారీ చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఎంపీడీవో చంద్రశేఖర్‌రావును ఆదేశించారు. మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, డ్రైనేజీ, సాగు, తాగునీటి విషయాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఐనంపూడి డ్రెయిన్‌లో పూడుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని, బ్రెయిలీ బ్రిడ్జి ప్రమాదకర స్థితికి చేరుకుందని, తక్షణం శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని కాజ ఎంపీటీసీ సభ్యురాలు పేకేటి వెంకటలక్ష్మి కోరారు. దమ్ము చక్రాల ట్రాక్టర్ల వల్ల రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్దరాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పద్దారాయుడుతోట సర్పంచ్ తాతా స్వప్న, వేములమడ సర్పంచ్, మంత్రిపాలెం సర్పంచ్ పంది కృష్ణ తదితరులు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీటీసీ సభ్యులు రాజులపాటి పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, తహసీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు** : అధికారులు తమపని తీరుని మార్చుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అధికారులను పరిచయం చేసుకుని శాఖల వారీగా ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, డ్రైనేజీ తదితర శాఖల అధికారులు సమావేశానికి రాకపోవటంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలిసారిగా తాను పాల్గొన్న మండల సమావేశానికి అధికారులు గైర్హాజరు కావటం విచారకరమన్నారు. సమావేశానికి రాని అధికారులకు షోకాజ్‌లు జారీ చేయాలని ఎంపీడీవో సత్యనారాయణను ఆదేశించారు. ఐలూరు శివారు కనిగిరిలంకలో రోడ్డుపై రూ 1.60 లక్షలతో వేసిన తాగునీటి పంపుని అంగన్‌వాడీ కార్యకర్త ఏడాదిన్నర క్రితం పంపు హెడ్ పీకేసి ప్రజలకు ఉపయోగపడకుండా చేసిందని, వైసీపీ నేతలు ఆమెకు కొమ్ముకాశారని, దీంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పుడైనా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సర్పంచ్ పీరాటి సుజాత కోరారు. తాను జనసేన సర్పంచ్ కావటంతో ఉపాధిహామీ అధికారులు తమ గ్రామంలో ఎఫ్ఎ ను నియమించలేదని, ఒక్క జాబ్‌కార్డు ఇవ్వకుండా పేదల పొట్ట కొట్టారని సర్పంచ్ ఆరోపించారు. టీడీపీ సర్పంచ్‌ని కావటంతో బొడ్డపాడులో సమస్యలను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని సర్పంచ్ మూడే శివశంకర్ తెలిపారు. వీటిని సరిదిద్దుతామని ఎమ్మెల్యే కుమార్ రాజా హామి ఇచ్చారు. తొలిసారిగా మండల సమావేశానికి హాజరైన వర్ల కుమార్ రాజాను అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సత్కరించారు జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.



మొవ్వ మండల సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌రాజా

ఇసుక అక్రమార్కులను వదిలిపెట్టం

తోట్లవల్లూరు : ఇసుక, బుసక దందాలకు పాల్పడి ప్రజా సంపదను దోచుకున్న అక్రమార్కులపై చర్యలుంటాయని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హెచ్చరించారు. తోట్లవల్లూరులో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో అవినీతికి పాల్పడ్డారని, తక్కువ ధరలున్న భూములను ఎకరం రూ.45 లక్షలకు కొనుగోలు చేయించి దోచుకు తిన్నారని వివరించారు. గెలుపొందిన 15 రోజుల్లోనే కాల్వల బాగుజేతకు రూ.90 లక్షలు మంజూరు చేయించానని, రహదారుల అభివృద్ధికి రూ.30 కోట్లతో అంచనాలు తయారు చేయించి పంపటం జరిగిందని కుమార్ రాజా తెలిపారు.

కలెక్టర్ కాలేఖాన్‌పేట పాఠశాల సందర్శన

మచిలీపట్నం టౌన్, జూలై 18 : ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు తర్ఫీదుకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కాలేఖాన్‌పేట మునిసిపల్ హైస్కూల్‌ను గురువారం కలెక్టర్ బాలాజీ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అన్నం పలుకుగా ఉందని మెత్తగా వండించాలన్నారు. గ్రంథాలయంలో రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థులు ఇంగ్లీషు, గణితం, సైన్సు సబ్జెక్టులపై ఎక్కువగా కేంద్రీకరించాలన్నారు. వీడియో పాఠాలు ఎలా చెబుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో దుర్గాప్రసాద్, ఎంఈవో -2 గురుప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

బైక్ అదుపు తప్పి ఆపరేటర్ దుర్మరణం

గుడివాడ : వర్షంలో బైక్ అదుపు తప్పి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. కాకతీయనగర్‌కు చెందిన అరిగెల లక్ష్మీనరసింహప్రసాద్ (47) క్రేన్ అపరేటర్‌గా పని చేస్తున్నాడు బుధవారం రాత్రి సుమారు 7గంటల సమయంలో సెల్ ఫోన్ రిపేరు కోసం బయలుదేరి వెళ్లాడు. వర్షం కురుస్తుండటంతో రాత్రి 10గంటల సమయంలో ప్రసాద్‌కు ఆయన భార్య ఫోన్ చేయగా దారిలో ఉన్నానని, వస్తున్నట్లు చెప్పాడు. రాత్రి ఇంటికి చేరలేదు. గురువారం ఉదయం 7గంటల సమయంలో విశ్వభారతి పాఠశాల వద్ద గల పాత మున్సిపల్ క్వార్టర్స్ వద్ద వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారమందింది. వర్షం కారణంగా బైక్ అదుపు తప్పి తల వెనుక భాగం గోడకు బలంగా గుద్దుకోవడంతో ప్రసాద్ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై హెచ్. నరసింహారావు తెలిపారు.





మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. రామకృష్ణయ్య

దివ్యాంగుల చట్టాలు సక్రమంగా అమలు చేయాలి

మచిలీపట్నం టౌన్ : దివ్యాంగుల చట్టాలను సక్రమంగా అమలు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. చైల్డ్ రైట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ల్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ, కారుణ్య రూరల్ యూత డెవలప్‌మెంట్‌ల ఆధ్వర్యంలో మచిలీపట్నం చిత్రకళా సంసద్‌లో గురువారం దివ్యాంగుల చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు, ల్యాంప్ డైరెక్టర్ సాల్మన్‌పాల్, కో ఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ, తూము మధుసూదనరావు, అంగన్‌వాడీ సీడీపీవో గ్లోరి తదితరులు ప్రసంగించారు. దివ్యాంగుల పెన్షన్లపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రతి ఇంటికి తాగునీరందిస్తాం : వెనిగండ్ల

గుడివాడ : కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం ఫేజ్-2.0ను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని, పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో పబ్లిక్‌హెల్త్, వాటర్ వర్క్స్ అధికారులతో గురువారం స్థానిక సమీక్షా సమావేశం నిర్వహించారు. అమృత్ 2.0లో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయి పనులపై ఆరా తీశారు. ప్రతి కుళాయి ద్వారా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, మున్సిపల్ వాటర్ వర్క్స్ డీఈ పాండురంగ, ఏఈ ప్రభాకర్, అమృత్ ఫేజ్ 2.0 కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అవనిగడ్డ రూరల్ : కొత్తపేట ఆర్టీసీ కాలనీలో పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నాయకులు చందన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ కాలనీలో 79 మంది ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని, సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రహదారుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని, దాదాపు 700 మీటర్ల రోడ్లు వేయించాలని వినతిపత్రంలో కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.



నడుపూరు పాల సంఘంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మిల్క్ యూనియన్ ఛైర్మన్ ఆంజనేయులు

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి

పెడన : పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడి రైతు సంక్షేమం మన మతం - అలుపెరుగని సేవ మన అభిమతం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గూడూరు మండలం రామానుజవర్ధల్లపల్లి, పెడన మండలం నడుపూరు పాల సంఘాలను సందర్శించి పాడి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకటనగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్ర మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్‌వైజర్ టి.బసవరాజ్‌కుమార్, పాల సంఘాల అధ్యక్షులు మోతుకూరి వెంకటేశ్వరరావు, ఆత్మూరి రత్నమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ పేరుతో టోకరా

గుడివాడ : రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టడంతో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ కొత్త పథకం కింద నగదు వస్తుందని చెప్పి సైబర్ నేరగాళ్ళు చాకచక్యంగా బ్యాంకు ఖాతా నుంచి నగదును కొట్టేశారు. టైలర్ కస్నూరి సాయి రామకృష్ణ(సాయి) కుమార్తె ఇటీవల రెండో కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చింది. తొలి కాన్పులో మగ పిల్లవాడు పుట్టగా, అప్పట్లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ రూ.5000 తండ్రి బ్యాంకు ఖాతాలో జమచేసింది. రెండో కాన్పు లో ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆరోగ్య శాఖ ప్రతినిధిగా పేర్కొంటూ 98214 50552 నెంబరు నుంచి బాలింత తండ్రి సాయికి వీడియో కాల్ వచ్చింది. గూగుల్‌పే లేదా ఫోన్‌పే యూపీఐ ఐడీ చెప్పాలని, బ్యాంకు ఖాతాలో తప్పనిసరిగా కొంత మొత్తం నగదు ఉండాలని, లేనిపక్షంలో వేరే వారి ఖాతా నెంబరు తెలిపినా నగదు జమ చేస్తామని నమ్మ బలికారు. సాయికి ఫోన్‌పే, గూగుల్‌పే లేకపోవడంతో మిత్రుడు గోపాల్‌ను ఆశ్రయించాడు. సాయి తన మిత్రుడు గోపాల్ నెంబర్, పేరు చెప్పగా గ్రోఫర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రూ.24,946 నగదు జమకు అనుమతి కోరుతూ గోపాల్‌కు మెసేజ్ వచ్చింది. తరువాత ఖాతాను చెక్ చేసుకోవాలని, నగదు జమ అయ్యిందని అగంతుకుడు తెలిపాడు. నగదు జమకాలేదని చెప్పడంతో యూపీఐ ఐడీ చెప్పమనడో అనుమానం వచ్చి గోపాల్ నిరాకరించాడు. గతంలో నగదు జమైందని, తనకు నమ్మకముందని సాయి చెప్పడంతో గోపాల్ యూపీఐ ఐడీని చెప్పాడు. దీంతో క్షణాల వ్యవధిలో గోపాల్ ఖాతా నుంచి రూ.5000 పోయాయి. మోసపోయామని గోపాల్, సాయి గ్రహించారు. వెంటనే తేరుకున్న గోపాల్ వెంటనే గూగుల్‌పే యాప్‌ను సెల్‌ఫోన్ నుంచి తొలగించాడు. ఎవరు అడిగినా యూపీఐ ఐడీని చెప్పవద్దని, తెలియని మెసేజ్‌లను క్లిక్ చేసి మోసపోవద్దని డీఎస్పీ శ్రీకాంత్ సూచించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



హెల్మెట్ ధారణపై అవనిగడ్డలో అవగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మూర్తి

అవనిగడ్డ : హెల్మెట్ల ధారణ ప్రాణ రక్షణ కలుగుతుందని, దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం జరగాల్సి ఉందని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్ అన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు అవనిగడ్డలో గురువారం మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్ ధరించాలని సీనియర్ సివిల్ జడ్జి బాబునాయక్, మెజిస్ట్రేట్ గోపినాథ్ విజ్ఞప్తి చేశారు. అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురాంప్రసాద్, సీఐ త్రినాథ్, ఎస్సై రమేష్, న్యాయవాదులు బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొండవీటి ఈశ్వరరావు, బడే వెంకట శేషగిరిరావు, తుంగల శ్రీనివాసరావు, శేఖర్ బాబు, అందె శ్రీరామమూర్తి తదిరతులు పాల్గొన్నారు. **కోడూరు** : ద్విచక్ర వాహనదారులకు రక్షణ కవచంగా హెల్మెట్ నిలుస్తుందని ఎస్సై శిరీష అన్నారు.. హెల్మెట్ ధరించటంపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లు ద్విచక్ర వాహణాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **గుడివాడ రూరల్** : ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని రూరల్ ఎస్సై మూర్తి అన్నారు. మల్లాయిపాలెం, మోటూరు, బొమ్ములూరు తదితర ప్రాంతాల్లో హెల్మెట్ ధారణపై ప్రయోజనాలను ద్విచక్ర వాహనదారులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించటం భారం కాదని, ద్విచక్ర వాహ నదారులకు రక్షణ అన్నారు. రూరల్ పోలీసు సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు ఉన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాల ఆవిష్కరణ

పెదపారుపూడి : భూషణగుళ్ల గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఫొటోలను గ్రామ టీడీపీ నాయకులు గురువారం ఆవిష్కరించారు. చలసాని నవీన్ చౌదరి, పొట్లూరి హనుమంతరావు, దేవుని శ్రీనివాసరావు, గోగం హరీష్, తలారి దుర్గా ప్రసాద్, కంచెర్ల శ్రీనివాసరావు, రమేష్, దొండపాటి పవన్, గొరిపర్తి వెంకట కృష్ణ, కొండవీటి శివకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో ఎమ్మెల్యే కాగిత పూజలు

పెడన : ఆకులమన్నాడు గ్రామంలోని కోదండ రామాలయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, కట్టా మునీశ్వరరావు, శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

బోడెకు బొడ్డు అభినందన

పెడన : రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు గురువారం పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, పరసా జితేంద్ర తదితరు పాల్గొన్నారు.



పాలకాయతిప్ప మెరైన్ సీఐ బదిలీ

కోడూరు : మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వల్లభనేని పవన్ కిషోర్ బదిలీ అయ్యా రు. సాధారణ బదిలీలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పవన్ కిషోర్ అందించిన సేవలను కొనియాడారు. సీఐకు ఘనంగా వీడ్కోలు పలికారు.



దాడి నిందితులపై చర్య తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్ : మోపిదేవి మండల పరిషత్ టీడీపీ కో ఆప్షన్ సభ్యుడు చందన రంగారావుపై దా డికి పాల్పడిన నిందితులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగారావును గురువారం కొనకళ్ల నారాయణరావుతో పాటు మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, యార్లగడ్డ సీతారామయ్య పరామర్శించారు.

శాకాంబరిగా దుర్గమ్మ

కూచిపూడి : కోసూరులో దుర్గాపార్వతీ అమ్మవారు గురువారం శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ట్రస్టీ గుత్తికొండ రమేష్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు గూడూరు రామకృష్ణ ప్రత్యేక పూజ లు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతులకు ఏవో శివప్రసాద్ సూచన

మచిలీపట్నం టౌన్ : వర్షాలు పడుతున్నందున వెదజల్లిన పంట పొలాల్లో కలుపు తొలగించడంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏవో శివప్రసాద్ సూచించారు. తరకటూరులో వెదజల్లిన పొలాలను సందర్శించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఊద, తుంగ, గరిక నివారణకు ఎకరాకు 400 మిల్లీ గ్రాముల చొప్పున క్లించర్ లేదా 100 మిల్లీ గ్రాముల నామినీ గోల్డ్ స్ప్రే చేయాలన్నారు. రామాంజనేయులు, హరిప్రసాద్, రహంతుల్లా, రాజ్యలక్ష్మి, విజయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేద్దాం

అవనిగడ్డ : బాల్యవివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో శేషుకుమారి కోరారు. అవనిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్యవివాహాల నిరోధంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల అనర్థాలను సీడీపీవో వివరించారు. సిబ్బంది సునీత, శాంతి, శౌరమ్మ, చైల్డ్ లైన్ కౌన్సిలర్ మేరీ, సూపర్‌వైజర్ రత్నమాల, ప్రధానోపాధ్యాయుడు ఎస్.రవీంద్రబాబు పాల్గొన్నారు.

గంగానమ్మకు సారె సమర్పణ

కోడూరు : గంగానమ్మ అమ్మవారికి గురువారం ఆషాడ సారె సమర్పించారు. ఇస్మాయిల్‌బేగ్ పేట రామాలయం వద్ద నుంచి మేళతాళాలు, మురళీ కోలాటంతో మహిళలు సారె తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కోట యుగంధర్‌రావు పర్యవేక్షించారు.